క్లుప్తంగా

24న వేలంపాట

వేంపల్లె : వేంపల్లెలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి కళ్యాణ మండపంలో ఈనెల 24వ తేదీన ఉదయం 10గంటలకు తలనీలాలు పోగు చేసుకునే హక్కుకుగానూ, అలాగే 12 గంటలకు శ్రీవృష భాచలేశ్వరస్వామి మండపం లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. ఈ వేలం పాట దేవాదాయ శాఖ అధికారుల సమక్ష్యంలో నిర్వహించనున్నామన్నారు.

వాహనాల తనిఖీ

సింహాద్రిపురం : వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఎస్ఐ వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహన పత్రాలను పరిశీలించి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన బొప్పెం లక్ష్మీనరసింహ సోమవారం అక్రమంగా మద్యం అమ్ముతుండగా 18 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతనిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటక్రిష్ణయ్య తెలిపారు.

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని మహాత్మ నగర్ కాలనీలో పేకాట ఆడుతుండగా నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

లింగాల : మండల కేంద్రమైన లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఎం.అమృత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ సమావేశంలో జగనన్న కాలనీలో పక్కాగృహాల నిర్మాణం, ఉపాధి హామీ, తాగు, సాగు నీరు, విద్య, వైద్య, వ్యవసాయ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి మండలస్థాయి అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలతో హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన తెలిపారు.

డ్రిప్ పరికరాలు దగ్ధం

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన గడ్డం దానియేలు అనే రైతుకు చెందిన డ్రిప్ పరికరాలు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. పంట కాలం పూర్తి కావడంతో రైతు డ్రిప్ పరికరాలను ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో కుప్పగా వేశాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు పడటంతో కాలిపోయాయని రైతులు చెబుతున్నారు. డ్రిప్ పరికరాలతోపాటు ప్లాస్టిక్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని రైతు అంటున్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోండి

వేముల : ఖరీఫ్ పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్ గౌడ్ రైతులకు సూచించారు. సోమవారం స్థానిక ఏపీజీబీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ పంట రుణాలు తీసుకున్న రైతులు ఏడాదికి రెండు, మూడు రోజులు ముందుగానే తమ పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యువల్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఏడాదిలోపు పంట రుణాలను రెన్యువల్ చేసుకున్నట్లయితే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తిస్తాయన్నారు.

పాలీసెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం



ఉచిత పాలీసెట్, ఏపీఆర్‌జేసీ గురించి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పాలీసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని సేవా సంస్థ అధ్యక్షుడు రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పూర్తి కావడంతో మే 10వ తేదీన ప్రభుత్వం నిర్వహించే పాలీసెట్, మే 20వ తేదీన నిర్వహించే ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఈ ఉచిత శిక్షణకు ఉపాధ్యాయ బృందం కృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, శ్యాంకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రామాంజనేయులు వద్ద విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు ఆదరణ



కమలాపురం: 2వ మున్సిపల్ వార్డులో ప్రచారం చేస్తున్న మహ్మద్ సాదిక్



చెన్నూరు: మైనార్టీ కాలనీలో ప్రభుత్వ పథకాలను తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మైలవరం(జమ్మలమడుగు రూరల్): ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీపీ సావిత్రి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు

వల్లూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. వల్లూరులోని మెయిన్ బజారులో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అర్హత వుండి ఇంకా ఏవైనా పథకాలు అందడం లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వంపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం వారి అనుమతితో గృహాల తలుపులకు స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బాల చంద్ర, పార్టీ నేతలు ప్రవీణ్, కరుణాకర్, చిట్టిబాబు, ఆనంద్, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలకు ప్రజలు తమ మద్దతు తెలియజేస్తూ ముఖ్యమంత్రి పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ మైనార్టీ నాయకులు అన్వర్‌బాష తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సచివాలయం-1 పరిధిలోని మూడవ వార్డు మైనార్టీ కాలనీలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ రబ్, డాక్టర్ చాన్ బాషలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ముఖ్యమంత్రి సందేశం వినిపించి మిస్డ్ కాల్ చేశారు. ఈ సందర్భంగా 50వ డివిజన్ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

– మండలంలోని కనపర్తి గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీటీసీ రఘురామిరెడ్డి, దౌలతాపురంలో కరుణాకర్, చెన్నూరు టౌన్‌లో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కమలాపురం: మా నమ్మకం నువ్వే జగన్... అని మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహ్మద్ సాదిక్ తెలిపారు. సోమవారం ఆయన మునిసిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఇంటింటికి తిరిగి ఆ కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు జగనన్న అందిస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్రంలో 87శాతం కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందని ప్రజలకు వివరిస్తూ వారి డోర్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. అలాగే మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో కౌన్సిలర్ల ఆధ్వర్యంలో, మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలే స్వచ్ఛందంగా తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాల గురించి చెప్పడం విశేషం.

వీరపునాయునిపల్లె: మండలంలోని యస్ పాలగిరి, నేలతిమ్మాయపల్లె, ఇందుకూరు, కొత్తపల్లె, అయ్యవారిపల్లె, యు రాజుపాలెం గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సోమవారం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పర్యవేక్షించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గృహ సారథులు, వాలంటీర్‌లు పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలపై గ్రామాల్లో విస్తృతంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. సోమవారం మైలవరం మండలంలోని బెస్తవేముల గ్రామంలో మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, తన్నీరు బాలయ్య బోడిశెట్టి మురళి, పరదేశి వెంకటేశులు నడిపి వెంకటేశులు, కొండిశెట్టి హరి తదితరులు పాల్గొన్నారు.



వీరపునాయునిపల్లె: మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న నాయకులు



వల్లూరు: ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

వేంపల్లె : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఆఫీసర్ డి.శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అగ్రి ప్రమాదాలలో మంటలు చెలరేగినప్పుడు వాటిని ఎలా ఆర్పివేయాలో డెమో చేసి చూపించారు. అనంతరం అగ్ని ప్రమాద పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం: అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వేదాస్ యూపీ స్కూల్‌లో అగ్ని ప్రమాదాలు- వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే ఎక్కడైనా ప్రమాదాలు జరిగినపుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. అనంతరం వదరల్లో చిక్కుకున్న వ్యక్తులను లైఫ్ బాయ్, లైఫ్ జాకెట్ ద్వారా రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధర, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : అగ్ని ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఇన్‌ఛార్జి ఆఫీసర్ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నివేదిత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విపత్తు, విపత్తు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణా చర్యలు, గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నివారణా చర్యల గురించి అగ్ని మాపక సిబ్బంది డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.



కమలాపురం: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సామాన్యులపై భారం మోపడం తగదు

వల్లూరు: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజానీకంపై పెను భారాన్ని మోపుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు గోపాల్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 14 వ తేదీ నుండి జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రమైన వల్లూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై మోపుతున్న భారాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి పీ చంద్ర శేఖర్, మండల కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, వెంకట రమణ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గురించి ప్రజలకు వివరిస్తున్న సీపీఐ నేతలు

పశువైద్య శిబిరం వినియోగించుకోవాలి

వేముల : గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొండ్రెడ్డిపల్లె, నారేపల్లె గ్రామాల్లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ వాటర్ షెడ్ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భారతి, వాటర్ షెడ్ అధికారి రఘునాథరెడ్డి, జేపీ చలపతి, లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్ మానస, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్, సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరు : మండల పరిధిలోని గంగనపల్లె, బలిజపల్లె గ్రామాల్లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లానీటి యాజమాన్య సంస్థ సహకారంతో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ శివ, డాక్టర్ రాధికలు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణా మందులతోపాటు గర్భనిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. అనంతరం పశువైద్య సిబ్బంది పశు పోషకులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రమ్య, కృష్ణ, గణేష్, సునీల్, వాటర్ షెడ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వేముల: మేకలకు, గొర్రెలకు చికిత్సలు చేస్తున్న పశువైద్య సిబ్బంది

హేలాంబకు పుష్పాలంకారం

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ అమ్మవారు పుష్పాలంకారంలో దర్శనమిచ్చారు. హేలాంబ తిరునాల మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం తెల్లవా రు జామున వేద పండితుల మంత్రోచ్ఛారణలతో చెప్పలి నరసింహ శాస్త్రి చేతుల మీదుగా అమ్మవారికి కంకణం కట్టారు. సాయంత్రం అమ్మవారికి పుష్పాలంకారం చేశారు. దివంగత జూటూరు వెంకట సుబ్బయ్య, పెద్ద సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారిని పుర వీధుల గుండా పల్లకిపై ఊరేగించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.



ఇళ్ల నిర్మాణాలలో నాణ్యత లోపిస్తే చర్యలు


– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



ఇళ్ల నిర్మాణాలపై సూచనలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ఇళ్ల నిర్మాణాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్ల నిర్మాణ పనుల కోసం వినియోగిస్తున్న సిమెంటు ఇటుకల తయారీని పరిశీలించి కాంట్రాక్టర్లకు తగిన సూచనలు జారీ చేశారు. కాలనీలో జరుగుతున్న రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై ఏ ఫిర్యాదు వచ్చినా సంబంధిత కాంట్రాక్టర్ బాధ్యత వహించాలన్నారు. ఇంటి నిర్మాణ పనుల రోజు వారీ పురోగతిని తనకు తెలపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యువతపై సర్వే



బలపనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

సింహాద్రిపురం : గ్రామంలో యువత ఎంతమంది ఉన్నారు.. ఎంతవరకు చదివారు, ఇప్పుడు ప్రస్తుతం ఏమి చేస్తున్నారు అనే దానిపై విద్యార్థులు సర్వే నిర్వహించనున్నారని ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మీకాంత తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో సింహాద్రిపురం కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ×అధికారిక విద్య లేదా సాధారణ ఉపాధిలో లేని యువత సర్వే× అనే అంశంపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మీకాంత మాట్లాడుతూ నిరుద్యోగుల సర్వే ఎలా నిర్వహించాలనే దానిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. తర్వాత విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. అనంతరం బలపనూరు గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరుని సన్నిధిలో జేసీ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామిని సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం ఉదయం ఆయన మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్, అర్చకులు శశిధర్ బృందం ఆయనకు సంప్రదాయ స్వాగతం పలికారు.

కంటి అద్దాలు పంపిణీ

కమలాపురం: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. సోమవారం కడపకు చెందిన నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపైర్‌మెంట్ (ఎన్‌పీసీబీ) సంస్థ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 523 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన 20 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందులలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని స్థానిక గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం తూర్పు ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న రోడ్డు పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఇంగ్లీషులో మాట్లాడడం నేర్చుకోవాలి



ఆంగ్లంలో మాట్లాడుతున్న విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్: విద్యార్థులు ఇంగ్లీషు భాషను అనర్గళంగా మాట్లాడటం నేర్చుకోవాలని జాన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎ. రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఇంగ్లీషు భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో తెలుగు భాషతో పాటు ఉన్నత చదువులకు వెళ్లిన తరువాత ఇంగ్లీషు భాష తప్పనిసరైందని తెలిపారు. దేశ, విదేశాల్లో ఉన్నత విద్య, ఉన్నత ఉద్యోగాలు చేయవలసి వచ్చినప్పుడు ఇంగ్లీషు భాషపై పట్టు ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సమావేశంలో ఇంగ్లీషు మాట్లాడిన తీరు తల్లిదండ్రులకు ఆకట్టుకుంది.